క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

పమిడిముక్కల: మండలంలోని మంటాడ, గురజాడ, తాడంకి, చోరగుడి, అలీనఖీపాలెం, పెనుమత్స, గోపాలకృష్ణాపురం గ్రామాలకు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నామని.. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ప్రమాదకరంగా మర్రివాడ వంతెన



పమిడిముక్కల: మండల పరిధిలోని మర్రివాడ వంతెన ప్రమాదకరంగా మారింది. రైవస్ కాలువపై ఉన్న ఈ వంతెన ఇరువైపులా పగుళ్లు వచ్చి గుంతలు ఏర్పడ్డాయి. సైడ్ వాల్స్ కూడా దెబ్బతిన్నాయని వాహన చోదకులు చెబుతున్నారు. ప్రమాదకరంగా మారిన వంతెన ఎప్పుడు కూలుతుందోనని గ్రామస్తులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. గత కొన్నేళ్లుగా వంతెన ప్రమాదరకంగా ఉందని.. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మర్రివాడ, యలమర్రు మీదగా గుడివాడకు దగ్గర దారి కావడంతో పెద్ద సంఖ్యలో వాహనాలు ఈ వంతెన పైనుంచే రాకపోకలు సాగిస్తుంటాయి. వంతెనకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పంచాయతీ వాటర్ వర్కర్స్ జీతాలు చెల్లించాలి



పామర్రు: పంచాయతీ వాటర్ వర్కర్స్‌గా విధులు నిర్వహిస్తున్న తమకు గత 13 నెలల నుంచి వేతనాలు చెల్లించడం లేదని.. సత్వరమే జీతాలు చెల్లించాలని కోరుతూ గురువారం మండల పరిషత్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపి అనంతరం అధికారులకు అర్జీని అందజేశారు. ఈ సందర్భంగా వర్కర్స్ మాట్లాడుతూ.. జీతాలు చెల్లించాలని అనేక సార్లు పంచాయతీ కార్యదర్శికి విన్నవించినా ఫలితం లేదని వాపోయారు. నెలల తరబడి జీతాలు రాకపోవడంతో అప్పులు పేరుకుపోయి ఇబ్బందులు పడుతున్నామన్నారు. సంబంధిత అధికారులు స్పందించి బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఒ.గంగాధర ప్రసాద్, కార్మికులు బురదగుంట శ్రీనివావవు, ఈడే వెంకట కృష్ణ, చీకటి నాగేంద్ర బాబు, బొమ్మారెడ్డి మధుసూధన్‌రెడ్డి, కలకోటి రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఉపసంహరించుకోవాలి

మొవ్వ: కృష్ణాజిల్లాలో రైతులు, కార్మిక సంఘాల నాయకులపై పోలీసుల వేదింపులు ఆపాలని.. అక్రమంగా పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శీలం నారాయణరావు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పని గంటల పెంపుదలకు వ్యతిరేకంగా అక్టోబర్ 7వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన నిరసనలలో భాగంగా మచిలీపట్నం కోనేరు సెంటర్‌లో ధర్నా చేసిన రైతులు, కౌలు రైతుల సంఘం, కార్మిక సంఘాల నాయకులు 23 మందిపై మచిలీపట్నం పోలీసులు అక్రమ కేసులు పెట్టి వేదించడాన్ని ఆయన ఖండించారు. పోలీస్‌లు వేదింపులను ఆపాలని ఆ ప్రకటనలో ఆయన పోలీస్ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

సమస్యలు పరిష్కరించాలంటూ వినతి

మండవల్లి: మండవల్లిలో సర్పంచ్ మెండా ఝాన్సీ అధ్యక్షతన గురువారం గ్రామసభ నిర్వహించారు. ఎస్సీ శ్మశాన వాటికలో జంగిల్ క్లియరెన్స్ చేయాలని.. అగ్రహారం రోడ్డుకు ఇరువైపులా కచ్చా డ్రెయిన్ నిర్మించాలని.. ఎస్సీ ఏరియాలో గోరింక గాంధీ వైపున సీసీ రోడ్డు పల్లంగా ఉన్నందున మెరక చేయించాలని పలువురు అర్జీలు అందజేశారు. కొత్తగా నిర్మించుకున్న ఇళ్లకు ఇంటి పన్నులు వేయమని నాగలక్ష్మి కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, గ్రామ ప్రముఖులు గుడివాడ చిట్టిబాబు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

డిబేట్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కోడూరు: జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 8న జిల్లా స్థాయిలో నిర్వహించిన డిబేట్ పోటీల్లో లింగారెడ్డిపాలెం జెడ్పీ పాఠశాలకు చెందిన గాదె కావ్య, కడవకొల్లు అంజలి ద్వితీయ స్థానంలో నిలిచినట్లు హెచ్ఎం కోడూరు నాగరత్నకుమారి తెలిపారు. 'ఆడపిల్లలను రక్షించండి' అనే అంశంపై డిబేట్‌లో పాల్గొని ప్రతిభ కనబరిచినట్లు వివరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సర్పంచి యర్రంశెట్టి శ్రీదుర్గా, పీఎంసీ కమిటీ చైర్మన్ రాంబాబులు అభినందించారు.

రహదారులా.. తటాకాలా!!



కూరాడ వద్ద దయనీయంగా రోడ్డు దుస్థితి



తటాకాన్ని తలపిస్తున్న చింతలగుంట రోడ్డు

- భారీ గుంతలతో గుడ్లవల్లేరు మండలంలో రహదారులు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండలం గుడ్లవల్లేరు నుంచి విన్నకోట వెళ్లే రహదారి పూర్తిగా గుంతలమయంగా మారింది. జేమ్స్‌పేట నుంచి వెళ్లే కట్టవానిచెరువు రోడ్డు కూడా ఛిద్రమై వాహన చోదకులను ఇబ్బందులు పెడుతోంది. ఈ రహదారుల్లో ప్రయాణం ప్రాణ సంకటంగా మారిందని ప్రజలు వాపోతున్నారు. చిన్నపాటి వర్షానికి సైతం గుంతలు చెరువులను తలపిస్తున్నాయని వాహన చోదకులకు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై ఉన్న గుంతల్లో వర్షపునీరు చేరి తటాకాలను తలపిస్తున్నాయి. ఫలితంగా వాటి లోతు ఎంతో తెలియక వాహన చోదకులు ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్నారు. వెంటనే ఈ రోడ్లను నూతనంగా నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

నడవాలన్నా యాతనే..

మండలంలోని గల పలు పాఠశాలల బస్సులు, కళాశాలల బస్సులు ఈ రహదారుల్లోనే ప్రయాణించాల్సి ఉంది. అలానే చిరు వ్యాపారాలు, రైతులు సైతం ఇదే రోడ్డులో రాకపోకలు సాగిస్తున్నారు. ఈ దారిలో నడవాలన్నా యాతనగా ఉందని స్థానికులు వాపోతున్నారు. మచిలీపట్నం, గుడివాడ, కైకలూరులకు అత్యవసరంగా వెళ్లాలంటే ప్రత్యామ్నాయ రోడ్లు లేకపోవడంతో వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక చిన్నారులు పాఠశాలలకు నడిచి వెళ్లాలంటే ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

అడుగు ముందుకు పడడంలేదు..



మా ఊరి రోడ్డు నుంచి గుడ్లవల్లేరు ప్రధాన రోడ్డులో వెళ్లాలంటే అడుగు ముందుకు పడడంలేదు. రహదారిపై మోకాలు లోతు గుంతలు ఉన్నాయి. వర్షం పడితే రోడ్లు తటాకాలను తలపిస్తున్నాయి. ఎన్ని సార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదు. ఇప్పటికైనా మా రోడ్డుకు పనులు నిర్వహించకపోతే మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

ఇంటూరి దావీదు, జేమ్స్‌పేట

హామీని అమలు చేయాలి..



మండలంలోని రోడ్ల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. సంక్రాంతికి రాష్ట్రంలోని రహదారులను పూర్తిగా బాగు చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. కానీ స్థానికంగా అలాంటి పనుల ఏమీ జరగలేదు. గుంతల రహదారులతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలి.

బలుసు జితేంద్ర, వైఎస్సార్ సీపీ మండల పోలింగ్ బూత్‌ల కన్వీనర్

ఔషదాలపై జీఎస్టీ తగ్గింపుతో పేద వర్గాలకు మేలు



పామర్రు సీహెచ్‌సీ కార్యక్రమంలో వైద్యులు సుదేష్‌బాబు



జీఎస్టీ తగ్గింపుపై అవగాహన..



శీతనపల్లిలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న సిబ్బంది, ప్రజలు

పామర్రు: ఔషదాలపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడం ద్వారా పేద, సామాన్య, మధ్య తరగతి వర్గాల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పామర్రు సీహెచ్‌సీ ప్రధాన వైద్యులు సుదేష్‌బాబు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గురువారం సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మందులపై ఎంత వరకూ జీఎస్టీ తగ్గిందో వివరించామని అన్నారు. దీంతో ప్రజలకు ఆర్థిక భారం తగ్గుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ జీఎస్టీపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. అనంతరం స్థానిక చైతన్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు జీఎస్టీపై అవగాహన కల్పించారు. జీఎస్టీ ఛాంపియన్లు పులిగడ్డ రాజేశ్వరి, ఇందుపల్లి స్వాతి, చైతన్య కళాశాల ప్రిన్సిపాల్ యలమంచిలి ప్రసాద్, అధ్యాపకులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు: మండలంలోని కౌతవరం రేషన్ షాప్ వద్ద జీఎస్టీ సేవింగ్స్‌పై కలిగే ఉపయోగాలను ప్రజలకు గురువారం అవగాహన కార్యక్రమం ద్వారా వివరించారు. కార్యక్రమంలో గుడ్లవల్లేరు సాయి విద్యానికేతన్ అధినేత శింగంశెట్టి ఆదినారాయణ, ఆరోగ్య సిబ్బంది కె.శిరీష, పి.ధనలక్ష్మి, 104 సిబ్బంది ప్రకాష్, చార్లెస్, ఆశాలు మరియమ్మ, సుబ్బమ్మ, పెద్దింట్లమ్మ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కైకలూరు: కేంద్రం సడలించిన జీఎస్టీలో వైద్య పరికరాలు, మందుల రేట్లు తగ్గింపుతో పాటు ఆరోగ్య జీవిత బీమా సులభతరమవుతోందని కైకలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ) సూపరింటెండెంట్ అల్లాడ శ్రీనివాసరావు, శీతనపల్లి పీహెచ్‌సీ డాక్టర్ ఎ.అన్నపూర్ణ తెలిపారు. సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై ప్రజలకు, సిబ్బందికి గురువారం అవగాహన కల్పించారు. మెడిసిన్స్‌పై జీఎస్టీ 18 శాతం నుంచి 5 శాతం తగ్గిందన్నారు. కైకలూరు సీహెచ్‌సీకి ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ జి.ప్రసాదరావు, డెవలప్‌మెంట్ ఆఫీసర్ పవన్, బాలశంకర్ హాజరయ్యారు. కలిదిండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జీఎస్టీపై అవగాహన ఆరోగ్యశాఖ సీహెచ్‌వో కృష్ణ కిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో వైద్య సిబ్బంది రహీం, రామకృష్ణ, సురేష్‌కుమార్, సాల్మన్‌రాజు, శ్రీదేవి, నాగమణి, ధనలక్ష్మీ, బీజేపీ నాయకులు కోకా శ్రీనివాస్, అంకాల దుర్గాప్రసాద్, చక్కా జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

బాబా ఆలయంలో అన్నసమారాధన



మండవల్లి: స్థానిక శ్రీ షిర్డీసాయిబాబా ఆలయంలో గురువారం అన్నసమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తొలుత బాబా వారికి ఆలయ అర్చకులు విశేష పూజలు జరిపారు. అనంతరం జరిగిన అన్నసమారాధన కార్యక్రమంలో మండవల్లి సమీప గ్రామాల భక్తులు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు గుడివాడ చిట్టిబాబు, బండారు వెంకయ్య, యిన్నా వెంకటేశ్వరరావు, పయ్యావుల సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రమాదవశాత్తు లారీ బోల్తా



నందివాడ: నందివాడ జిల్లా పరిషత్ హైస్కూల్, హాస్టల్ వద్ద గల నెహ్రాలీ కాలువ కల్వర్ట వద్ద గురువారం ఉదయం లారీ ప్రమాదవశాత్తు బోల్తా పడింది. రహదారిపై కటింగ్ చేసే సమయంలో లారీ బోల్తా పడిందని స్థానికులు వివరించారు. దీంతో కల్వర్టు వద్ద గల వంతెన పూర్తిగా ధ్వంసమైంది. ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. యుద్ధ ప్రాతిపదికన కాలువ కల్వర్టుకు మరమ్మతులు చేపట్టి లారీను బయటకు తీశారు. ఈ క్రమంలో ఆర్ అండ్‌బీ డీఈ సూచనల మేరకు తాత్కాలికంగా అటు వైపు వాహనాల రాకపోకలు నిలిపివేశారు. ఇరిగేషన్ ఏఈ, పవన్ కుమార్, ఇరిగేషన్ డీఈ ఇ.సూర్యభరత్ మరమ్మతుల పనులను పర్యవేక్షించారు.

కైకలూరు పట్టణ సీఐగా ఏవీఎస్ రామకృష్ణ



కైకలూరు: కైకలూరు పట్టణ సీఐగా ఏవీఎస్ రామకృష్ణ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన సీఐ పి.కృష్ణ కైకలూరు శివారు దానిగూడెం దళితలపై దాడి ఘటన నేపథ్యంలో వీఆర్‌లోకి వెళ్లారు. విజయవాడ ఇంటిలిజెన్స్ విభాగంలో సీఐ విధులు నిర్వహిస్తున్న రామకృష్ణ సాధారణ బదిలీల్లో భాగంగా కైకలూరు సీఐగా వచ్చారు. ఈయన ముదినేపల్లి ఎస్ఐగా కొంతకాలం పనిచేశారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



కోరుకొల్లులో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఫణీంద్ర

కలిదిండి(కైకలూరు): చెత్త రహిత మండలంగా కలిదిండిని తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలిదిండి ఎంపీడీవో ఆర్ ఫణీంద్ర అన్నారు. కోరుకొల్లు పంచాయతీలో డ్రెయిన్ల మరమ్మతులు, చెత్త తొలగింపు పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో పంచాయతీల కార్యదర్శులు పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. అనంతరం కోరుకొల్లు ఎస్సీ బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. హాస్టల్‌లో డ్రెయినేజీ సమస్య ఉందని గమనించారు. కార్యక్రమంలో కోరుకొల్లు పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్రరావు, హాస్టల్ వార్డెన్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నీటిని కలుషితం చేస్తే ఉపేక్షించం..

కలిదిండి(కైకలూరు): తాగు, సాగు నీటి కోసం విడుదలవుతున్న పంట కాలువల నీటిని కలుషితం చేసే వ్యక్తులపై చర్యలు తప్పవని కలిదిండి ఎంపీడీవో ఆర్ ఫణీంద్ర హెచ్చరించారు. ఇటీవల మండల పరిషత్ సమావేశంలో నీటి సంఘ అధ్యక్షుడు మద్దం భోగేశ్వరరావు సంతోషపురం నుంచి పెదలంక వరకు గల కాలువ గట్టుపై నివాసితులు మురుగు, చెత్తాచెదారాలను కాలువలోకి విడిచిపెడుతున్నారని ఫిర్యాదు చేశారు. దీంతో వైఎస్సార్‌సీపీ ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు ఆదేశాలతో ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, పంచాయతీ అధికారులు కాలువలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఫణీంద్ర మాట్లాడుతూ.. కాలువల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

దేవస్థానాల జీర్ణోద్ధరణకు దాతల విరాళం



చైర్మన్ వల్లభనేనికి విరాళాన్ని అందిస్తున్న దాతలు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి, శ్రీ గంగానమ్మ తల్లి దేవస్థానాల జీర్ణోద్ధరణ పనులకు గురువారం పలువురు దాతలు విరాళాలను అందజేశారు. ఆలయాభివృద్ధికి శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజ్ ఓల్డ్ స్టూడెంట్స్ రూ.50వేలు, శాఖమూరి శ్రీనివాసరావు, శివశ్రీ దంపతులు రూ.10,116, విజయవాడకు చెందిన మద్దుకూరి ధనలక్ష్మి రూ.10,116, వినుకొండకు చెందిన అల్లా ఆంజనేయులు, అనురూప దంపతులు రూ.10,116, లంకసాని నరసింహమూర్తి, మీనాక్షి దంపతులు రూ.10,116, కాకినాడకు చెందిన మద్దిపట్ల సుధాకర్, పద్మ దంపతులు రూ.10,116, గోళ్ల బ్రహ్మాజీ, విజయశ్రీ దంపతులు రూ.10,116, గద్దె సత్యనారాయణ, సుబ్బలక్ష్మి దంపతులు రూ.10,116, చల్లపల్లికి చెందిన కావూరి సుబ్బారావు, దుర్గాభవాని దంపతులు రూ.10,116, గుంటూరుకు చెందిన ఉనం జగ్గయ్య, అనసూయమ్మ దంపతులు, నన్నపనేని రవీంద్రనాథ్, మనీషా దంపతులు రూ.10,116 విరాళాలను అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఈఆర్ఎం విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, మాజీ జెడ్పీటీసీ కొసరాజు బాపయ్యచౌదరి, నెహ్రూ పశువుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు, డైరెక్టర్ వల్లభనేని బుడ్డిబాబు, చాపరాల రామారావు, దేవస్థాన ధర్మకర్తలు మురాల నరేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



గుడ్లవల్లేరు: సైబర్ సెక్యూరిటీ అవేర్‌నెస్ మాసం గురించి గుడ్లవల్లేరు ఎస్ఈఆర్ఎం హైస్కూల్లో విద్యార్థులకు గురువారం ఎస్ఐ ఎన్‌వీవీ సత్యనారాయణ అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఉత్తర్వులు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన తెలిపారు. సైబర్ సెక్యూరిటీ నేరాల తీరును వివరిస్తూ వీడియోలు స్క్రీన్‌పై విద్యార్థులకు చూపించారు. అలానే మహిళల భద్రత, రహదారి భద్రత నియమాలను విద్యార్థులకు వివరించారు. సైబర్ మోసాలను నివారించుకునేందుకు 1930 నంబర్‌కు డయల్ చేయాలన్నారు. మహిళా భద్రత, రోడ్డు భద్రతకు 112కు డయల్ చేయాలని కోరారు. మాదక ద్రవ్యాలకు విద్యార్థులు నో చెప్పాలని సూచించారు.

నేటి నుంచి ధ్యాన మహాయజ్ఞం



గుడివాడ టౌన్: శ్రీ రమణ మహర్షి పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు ధ్యాన మహాయజ్ఞం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ధ్యాన కేంద్ర నిర్వాహకురాలు రాజకుమారి తెలిపారు. గురువారం స్థానిక రాజేంద్ర నగర్‌లోని ధ్యానకేంద్రం కార్యాలయంలో సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి ఆదివారం రాత్రి వరకు నిరంతరాయంగా యజ్ఞం కార్యక్రమాలు కొనసాగుతాయని ఆమె అన్నారు. గుడివాడ పరిసర ప్రాంత ప్రజలు కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ధ్యానకేంద్ర సభ్యులు డాక్టర్ మలిరెడ్డి రవి, డాక్టర్ చంద్రశేఖర్, వాణి పాల్గొన్నారు.

ఘనంగా అట్లతద్దె వేడుకలు



మొవ్వ: అట్లతద్దె వేడుకలను గురువారం మొవ్వ మండలంలోని పలు గ్రామాల్లో మహిళలు ఘనంగా నిర్వహించారు. ఆశ్వీయుజ బహుళ తదియనాడు నిర్వహించే నోమును మహిళలు భక్తిశ్రద్ధలతో నోచుకున్నారు. వయస్సుతో తారతమ్యం లేకుండా గ్రామాలలో ఉయ్యాల వేడుకలను వైభవంగా నిర్వహించారు. నోములో భాగంగా వాయినాలు ఇచ్చి పుచ్చుకోవడం చేశారు. సాయంత్రం గౌరీదేవి పాటలతో మహిళలు స్థానిక ఆలయాలను సందర్శించారు.

మండవల్లి: మండలంలోని గ్రామాల్లో అట్లతద్దె పండుగను మహిళలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి మహిళలు ఉపవాసం ఉండి ముత్తయిదువలకు భక్తిశ్రద్ధలతో వాయినాలు అందించారు. అట్లతద్దె సందర్భంగా ఇంటింటా పండుగ వాతావరణం నెలకొంది.

బోధనేతర పనులు బహిష్కరించాలి



ఎంఈవోలకు వినతి పత్రాన్ని అందిస్తున్న ఉపాధ్యాయులు

కైకలూరు: మితిమీరిన బోధనేతర కార్యక్రమాలను బహిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈవో-01, ఎంఈవో-2 రామారావు, శ్రీనివాసరావులకు గురువారం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నాయకులు మాట్లాడుతూ.. మితిమీరిన బోధనేతర కార్యక్రమాలతో బోధనా సమయం హరించుకుపోతుందన్నారు. ఉపాధ్యాయులకు కూడా బోధనపై ఆసక్తి తగ్గిపోయే విధంగా బోధనేతర కార్యక్రమాలు పెరిగిపోయాయన్నారు. బోధనేతర పనులను శుక్రవారం నుంచి బహిష్కరించాలని ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో నాయకులు వడ్డీ శ్రీనివాసరావు, దండే బెనర్జీ, జయరాం నాయుడు, నున్న లక్ష్మణ్, నగుడు రామారావు, కట్టా వెంకటేశ్వరరావు, సురేష్ పాల్గొన్నారు.

కృష్ణా వర్సిటీలో ప్రారంభమైన ఆటల పోటీలు

కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు జరగనున్న ఆటల పోటీలు గురువారం ప్రారంభయ్యాయి. పోటీలను ఉపకులపతి ఆచార్య కె.రాంజీ సూచనల మేరకు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.విజయ్‌కుమారి సమన్వయంలో వర్సిటీలోని ఇండోర్ స్టేడియంలో లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల డీన్ ఆచార్య వైకే సుందరకృష్ణ, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ పి.రాంబాబు పాల్గొన్నారు. వివిధ రకాల క్రీడా పోటీలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో వర్సిటీ ప్రాంగణంలోని మూడు కళాశాలల విద్యార్థులు, వర్సిటీ అనుబంధ కళాశాల అయిన నూజివీడు పీజీ క్యాంపస్ విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి రోజు క్రీడా విభాగంలో పురుషులు, మహిళలకు విడివిడిగా పోటీలు నిర్వహించారు. టేబుల్ టెన్నిస్‌కు సంబంధించి 20 జట్లు, వాలీబాల్‌కు 4 జట్లు, చెస్ విభాగంలో 37 మంది పాల్గొన్నారు. సాంస్కృతిక విభాగంలో సోలో, గ్రూపు సాంగ్స్, డాన్సులతో విద్యార్థులు సందడి చేశారు. రెండో రోజైన శుక్రవారం ఆటల పోటీల అనంతరం ఉప కులపతి చేతులమీదుగా విజేతలకు బహుమతులను అందజేస్తారు. క్రీడా విభాగ సమన్వయకర్తగా పి.డి డాక్టర్ గోపి, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్.దుర్గాప్రసాద్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

కోదండ రామాలయానికి రూ.లక్ష విరాళం



ఆలయ అభివృద్ధికి చెక్కు అందిస్తున్న దాతలు

అవనిగడ్డ: అవనిగడ్డ మూడో వార్డులోని ప్రసిద్ధ కోదండ రామాలయం అభివృద్ధి నిమిత్తం అదే వార్డుకు చెందిన కూనపరెడ్డి రాధాకృష్ణ, పార్వతి దంపతులు, వారి కుమారులు త్రినాథ్, కుందన్, కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళాన్ని చెక్కు రూపంలో గురువారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు రాధాకృష్ణను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అన్నపరెడ్డి కృష్ణ, అన్నపరెడ్డి శ్యామ్‌సుందర్, అన్నపరెడ్డి ఆంజనేయులు, ఓంకారం నాగభూషణం, అన్నపరెడ్డి వెంకటేశ్వర్లు, అంబుల వెంకటప్పయ్య, ఆలయ ప్రధాన అర్చక పండితుడు క్రోవి శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

రంగవల్లులతో గ్రామ చిత్రపటాలు



ఘంటసాల గ్రామ చిత్రపటాన్ని రంగులతో వేసి రైతులకు వివరిస్తున్న బాపట్ల విద్యార్థినులు

ఘంటసాల: రంగవల్లులతో గ్రామాల చిత్రపటాలు వేసి ఆయా గ్రామాల స్థితిగతులపై రైతులు, ప్రజలకు అవగాహన కల్పించడం అభినందనీయమని కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి అన్నారు. గ్రామీణ అవగాహన కృషి కార్యక్రమంలో భాగంగా ఘంటసాల, తాడేపల్లి గ్రామాల్లో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు గురువారం గ్రామాల చిత్రపటాలను రంగవల్లులతో వేసి, గ్రామ, వ్యవసాయ భూముల విస్తీర్ణం, గ్రామాల్లో ఎక్కువ సాగు చేస్తున్న పంటల వివరాలు, స్థాపించిన సంస్థలు, సీజనల్ క్యాలెండర్, మొబిలిటీ మ్యాప్‌లు, టైమ్ ట్రెండ్, తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు, ఆయా గ్రామాల్లోని అభ్యుదయ రైతులు, బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి



ప్రచారం నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

గుడివాడ టౌన్: ఎయిడ్స్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉంటే జీవిత కాలాన్ని పెంపొందించుకోవచ్చని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ జయప్రద అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఎయిడ్స్ నియంత్రణ, వ్యాప్తి నివారణ అంశాలపై అవగాహన సంచార కార్యక్రమం ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు జి.జోన్స్, టీబీ సూపర్‌వైజర్ బి.రాకేష్, ఐసీటీసీ సిబ్బంది, క్లస్టర్ లింక్ వర్కర్స్ పి.దేవి, కె.వినయ్ తదితరులు పాల్గొన్నారు. ప్రదర్శనను పెదపారుపూడి, కలవపాముల, వెంట్రప్రగడ, ముదునూరు గ్రామాలలో నిర్వహించామన్నారు.